క్లుప్తంగా

మిత్రపురుగుల సంరక్షణపై అవగాహన

నల్లజర్ల: అనంతపల్లిలో గురువారం జరిగిన ఏడో వారం పొలంబడి కార్యక్రమంలో మిత్రపురుగుల సంరక్షణపై మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్ రైతులకు వివరించారు. మిత్రపురుగైన సాలీడులు, కందిరీగలు, ట్రైకోగ్రామా, టిలీనిమాస్ వంటి గుడ్లు, పరాన్నజీవులు, బిల్ల, అక్షింతల పురుగుల వంటి మిత్ర పురుగులను రైతులు సంరక్షించాలని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకొని పంటలపై ఎటువంటి క్రిమిసంహారక మందులు పిచికారీ చేయకూడదన్నారు. గ్రామాల్లో వేసవిలో లభించే వేపకాయలను సేకరించి వేపకషాయం ఏవిధంగా తయారు చేసుకోవాలో జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ జ్యోతిర్మయి రైతులకు వివరించారు. వీసా అగ్రోసిస్టమ్ ఎనాలసిస్ విధానంలో పిలకలు తుంచడం, ఆకులు కత్తిరించడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. వనరులకేంద్ర ఏఓ వెంకన్నబాబు, ఏఈఓ పుష్పలత, వ్యవసాయ సహాయకులు జాన్‌పాల్, సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



అప్పారావును సత్కరిస్తున్న పింఛనుదారులు

నిడదవోలు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కలెక్టర్ డాక్టర్ కె.మాధవిలత చేతుల మీదగా ఉత్తమ సబ్‌ట్రెజరరీ అధికారిగా అవార్డు తీసుకున్న జి.అప్పారావును రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం నిడదవోలు శాఖ అధ్యక్షుడు బలగం అప్పారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజనేయులు, బొజ్జ పాపారావు, పొన్నా కృష్ణబాబు, పొన్నా సుబ్రహ్మణ్యం, దుర్గారావు, ఎస్‌కే షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దాబాల్లో మద్యం అనుమతిస్తే కఠిన చర్యలు

నిడదవోలు: రహదారుల పక్కన ఉన్న రెస్టారెంట్లు, దాబా హోటళ్లలో మద్యం తాగడానికి అనుమతించినా, మద్యం విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో నిడదవోలు ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. రహదారుల పక్కన ఉన్న దాబా హోటళ్లలో మద్యం సేవించి వాహనాల నడపడం వల్ల ప్రమాదాలకు కారణం అవుతున్నారని, అందువల్ల జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి పిట్టా సోమశేఖర్ ఆదేశాలతో దాబాలు, రెస్టారెంట్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. గత మే నెలలో విజ్జేశ్వరంలో రహదారి పక్కన ఉన్న గోదావరి దాబాలో మద్యం అనుమతించడంతో ఆ దాబా యజమానితోపాటు 16 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాబాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, అనుమతించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పట్టాలిప్పించాలంటూ వినతి



రాజమహేంద్రవరంలో డీఎఫ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న కరగపాడు గ్రామస్తులు

గోపాలపురం: మండలంలో కరగపాడు, బుచ్చియ్య పాలెం, గుడ్డిగూడెం గ్రామస్తుల అటవీభూమికి సంబంధించిన పోడు భూములను పేదలకు పంచాలంటూ గురువారం రాజమహేంద్రవరం జిల్లా ఫారెస్టు అధికారి కె.రామారావుకు వినతిపత్రం అందజేశారు. నిరుపయోగంగా ఉన్న పోడుభూమిని సాగు చేసుకొని జీవిస్తామని, ప్రభుత్వం తమకు పట్టాలు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరారు. గ్రామస్తుల వినతిపత్రంపై డీఎఫ్‌ఓ మాట్లాడుతూ ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని ఆయన పేర్కొన్నారు. డీఎఫ్‌ఓను కలిసిన వారిలో జక్కు అచ్చియ్య, గెల్లా రాజు, ఉందుర్తి వెంకటరత్నం, కండెల్లి నవీన్ ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధం



తీపర్రులో ప్రారంభానికి సిద్ధమైన విలేజీ క్లినిక్

పెరవలి: అభివృద్ధికి మారుపేరు ఆ గ్రామం, ప్రభుత్వ పథకం ఏదైనా ఆ గ్రామంలో ఉండాల్సిందే. అదే పెరవలి మండలం తీపర్రు గ్రామం నియోజకవర్గంలోనే మొట్టమొదటి సచివాలయ భవనం నిర్మించడంతో పాటు ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ భవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ మాధవీలత ప్రశంసల వర్షం కురిపించారు. ప్రభుత్వం ప్రతి గ్రామానికి కేటాయించినట్లు గానే ఈ గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే(రైతు బరోసా కేంద్రం) నిర్మించి ప్రారంభించగా ఇప్పుడు విలేజీ హెల్త్ క్లినిక్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ భవన నిర్మాణాలను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుందుల భూపతిరావు చేపట్టి పూర్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి

- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- జిల్లాలో 34 వేల ఎకరాల్లో సాగు
- మార్కెట్లో ఉత్పత్తులకు డిమాండ్



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న వరి చేను

దేవరపల్లి: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆసక్తి పెరుగుతోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం, ఆరోగ్యకర పంటలు లభిస్తుండడంతో సాగుపై మొగ్గుచుపుతున్నారు. రసాయనిక, క్రిమిసహారిక మందుల వినియోగానికి స్వస్తి చెప్పి ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను పండించి లాభాలను పొందుతున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహించి, అనేక రాయితీలు కల్పించడంతో రైతులు అటువైపు అడుగులు వేస్తున్నారు.

36 వేల మంది రైతులు.. 34 వేల ఎకరాల్లో సాగు

జిల్లాలో ప్రకృతి వ్యవసాయం పంటల సాగు ఏటా విస్తరిస్తోంది. సాగుపై వ్యవసాయాధికారులు గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పండ్ల తోటలతో పాటు వరి పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 30 వేల ఎకరాల్లో పంటలు పండించగా, ఈ ఏడాది 34 వేల ఎకరాలకు పెరిగింది. ఎక్కువగా పండ్ల తోటలు, వరి సాగు చేస్తున్నారు. ఒక్కో రైతు అర ఎకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. 18 వేల ఎకరాల్లో వరి, 16 వేల ఎకరాల్లో పండ్ల తోటలు సాగవుతున్నాయి. రబీలో 12 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేసి, ఎకరాకు 40 నుంచి 42 బస్తాలు దిగుబడి సాధించారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 30 బస్తాలు దిగుబడి సాధించారు.

పొలంబడి కార్యక్రమంతో..

ప్రతి మండలంలో 5 నుంచి 10 గ్రామాలను ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా రైతులను ప్రోత్సహించి పంటలపై పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించి, సాగు వైపు మళ్లిస్తున్నారు. పురుగు మందులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు.

గ్రామ సంఘాల ద్వారా సేంద్రియ ఎరువులు

గ్రామ సంఘాల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు సరఫరా చేస్తున్నారు. కషాయాలు, ఆవు మూత్రంతో పంచ గవ్య, అగ్నిహస్త్రం , బ్రహ్మస్త్రం, నవధాన్యాల కిట్లు, లింగాకర్షణ బుట్టలు, వేపపిండి, ఇంగువ ద్రావణం, తయారు చేసి రైతులకు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 110 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. 340 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.



దుద్దుకూరులో పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆరోగ్యకరంగా పంటలు



ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటలు ఆరోగ్యకరంగా ఉన్నాయి. గ్రామస్థాయిలో సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సిబ్బంది జీవన ఎరువులను తయారు చేసి రైతులకు సరఫరా చేస్తున్నారు. అగ్నిహస్త్రం, చేప వేస్ట్, బెల్లం ద్రావణాన్ని విడితే దుబ్బు, పిలకలు ఎక్కువగా వస్తాయి. జిల్లాలో 36 వేల మంది రైతులు, 34 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వరి సాగుకు ఎకరాకు రూ.10 వేలు ఖర్చు తక్కువ అవుతుంది. ప్రతి ఏటా సాగు విస్తీర్ణం, రైతుల సంఖ్య పెరుగుతుంది. ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. 110 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

– తాతారావు, డీపీఎం, తూర్పుగోదావరి జిల్లా

800 మెట్రిక్ టన్నుల బియ్యం టీటీడీకి సరఫరా

ఈ ఏడాది ఖరీఫ్‌లో 800 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం 400 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ బియ్యాన్ని టీటీడీలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి వినియోగిస్తారని అధికారులు తెలిపారు.

ఓట్ల తొలగింపునకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలిస్తే చర్యలు

ఆర్డీవో మల్లిబాబు



కొవ్వూరు: ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపునకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు దాఖలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో ఎస్. మల్లిబాబు హెచ్చరించారు. ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా ఓటర్ల పేర్లు తొలగింపునకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు దాఖలు చేస్తే క్షేత్ర స్థాయిలో పరిశీలన అనంతరం ఆ వ్యక్తులపై 1980 ప్రజాప్రతినిధ్య చట్టంలోని సెక్షన్ 31కి లోబడి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఓటర్ల తొలగింపు నిమిత్తం ఒక వ్యక్తి ఐదుగురుకి మించిన పేర్లను ఫారమ్–7 సమర్పించిన క్రమంలో సంబంధిత ఈఆర్ఓ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పేర్లను తొలగించే క్రమంలో క్షేత్ర స్థాయిలో ముగ్గురు సభ్యులతో కలిసి సహాయ ఈఆర్‌వో, బీఎల్‌వో, డిప్యూటీ తహసీల్దార్ హోదా కలిగిన సభ్యుల బృందం పరిశీలన చేస్తారన్నారు. పరిశీలించిన నిర్ధారించుకున్న తర్వతనే పేర్లు జాబితా నుంచి తొలగిస్తామన్నారు. తనిఖీకి వెళ్లే సమయంలో వివరాలను ఆయా పోలింగ్ కేంద్రాలకు చెందిన రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవెల్ ఏజెంట్లకి సమాచారం అందిస్తామన్నారు. ఓటు తొలగింపునకు ఉద్దేశ పూర్వకంగా తప్పుడు అభ్యంతరం తెలియజేస్తే చట్టప్రకారం ఆ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, అపరాధ రుసుం లేదా రెండు విధించే అవకాశం ఉంటుందన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్సీ సాబ్జి పాఠాలు

నల్లజర్ల: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి విద్యార్థులకు పాఠాలు బోధించారు. గురువారం ఆయన నల్లజర్ల జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు.

ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టాలి

హైస్కూలులో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలల్లో సాధారణ కోర్సులతో పాటు ఒకేషనల్ కోర్సులు కంప్యూటర్, ఎమ్మెల్టీ, వెటర్నరీ కోర్సులు ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కళాశాలల్లో సైన్సు ల్యాబ్‌లను ఏర్పాటు చేసి ల్యాబ్ టెక్నీషియన్లను నియమించాలన్నారు. ఇంటర్ తరగతులు బోధిస్తున్న పీజీటీలను రెగ్యులర్ ప్రమోషన్లగా పరిగణించాలన్నారు. 117జీవో రద్దు చేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 3, 4, 5 తరగతుల విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలకు పంపి డీఈడీలతో నడపాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలన్నారు. ఆయనతో పాటు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహరకుమార్, మండల ప్రధాన కార్యదర్శి బండి కిశోర్, పాఠశాల హెచ్ఎం కోమలిచిత్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో ఫిజిక్స్ పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జి

నేడు చాగల్లులో 'గడప గడపకూ'

చాగల్లు: గ్రామంలో శుక్రవారం నుంచి నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర హోమ్, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత పాల్గొంటారని మండలం వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని పిలుపు నిచ్చారు.

మార్కెట్ కళకళ.. ధరలు దడదడ..

- చుక్కలనంటిన పూలు, పండ్ల ధరలు
- కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్



కాకరపర్రు పూల మార్కెట్‌లో ఉన్న పూలు

పెరవలి/తాళ్లపూడి: శ్రావణ శుక్రవారం సందర్భంగా మార్కెట్‌లో పూలు, పండ్ల ధరలకు రెక్కలు రావడంతో వినియోగదారులు హడలిపోతున్నారు. పెరవలి మండలం కాకరపర్రు పూలమార్కెట్‌లో గురువారం ఉదయం నుంచివివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారస్తులు, కొనుగోలుదారులతో కళకళలాడింది. హోల్‌సేల్ మార్కెల్‌లో కిలో బంతి పూలు రూ.60లు ధర పలకగా చామంతిపూలు రూ.400, కనకాంబరాలు రూ.1000, మల్లెపూలు, సన్నజాజులు కిలో రూ.1200 ధరలు పలికాయి. గులాబీలు ఒక్కొక్కటి రూ.3లు, చామంతి పువ్వు ఒక్కటి రూ.5లు, లిల్లీపూలు రూ.250 ధర పలికింది. విడిగా మార్కెట్టులో మూర మల్లెపూలు, జాజులు రూ.80, కనకంబరాలు మూర రూ.120 ధరలు పలికాయి. పండ్ల రకాలలో ఆపిల్ సైజ్‌ను బట్టి ఒక్కటి రూ.20 నుంచి రూ.30లు, బత్తాయి రూ.15, నారింజ రూ.5, దానిమ్మ రకాన్ని బట్టి రూ.20 నుంచి రూ.30ల వరకు, పంపర పనస కాయ ఒకటి రూ.40 నుంచి రూ.70లు ధర పలికాయి. కలువ పూలు ఒక్కటి రూ.50 ధరలు పలికాయి. దీంతో వినియోగదారులు నాలుగు కొనవలసిన చోట రకానికి ఒకటి చొప్పున కొనుగోలు చేసి పండగను జరుపుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. మరోవైపు కిరాణా సరుకులు రోజుకీ పెరిగిపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతుండగా ఇప్పుడు ఈ పువ్వులు, పండ్ల ధరలు పెరిగిపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక చిల్లర వర్తకుల దగ్గర మూర కనకంబరాలు రూ.150 పలకగా, చామంతి పువ్వు ఒక్కటి రూ.5లకు అమ్మడంతో వినియోగదారులు అవాక్కయ్యారు.

జయహో భారత్

- చంద్రయాన్–3 విజయోత్సవాలు
- పాఠశాలల్లో విద్యార్థుల సందడి



చాగల్లులో ఇస్రో ఇండియా ఆకారంలో కూర్చున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు


చాగల్లు: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు చాగల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గురువారం ఇస్రో ఇండియా ఆకారంలో కూర్చుని శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ జెండాను పట్టుకుని జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. చంద్రయాన్–3 సేఫ్ ల్యాండింగ్ విజయంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎం పి.వీర్రాజు, వ్యాయమ ఉపాధ్యాయులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: చంద్రయాన్–3 విజయంపై దూబచర్లలో గురువారం సంఘమిత్రా స్కూలు విద్యార్థులు సంబరాలు నిర్వహించారు. జాతీయ జెండాలు చేతబట్టి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సెంటర్‌లో పిరమిడ్లు వేసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు, పార్ద్ ఇండియా గౌరవ అధ్యక్షుడు చీమకుర్తి ప్రసాద్, నెక్కంటి వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


నిడదవోలు: పట్టణంలో బీజేపీ నాయకులు గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండి సత్యనారాయణ, నీలం రామారావు, కట్టుంగ అచ్చియ్య, నిడమరిత భాస్కరరావు, నిడమర్తి రామచంద్రరావు, బీఆర్‌కే సూర్యనారాయణమూర్తి, మరపట్ల సాయిరాం, ఉయ్యూరి ప్రసాద్, పెనుమాళ్ళ శ్రీనివాస్, జంగిలి లలిత తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ఆర్ఎస్ఎస్, తాళ్లపూడి గ్రామస్తుల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి తాళ్లపూడి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ జి.ప్రసాద్ బస్టాండ్ సెంటర్ నుంచి ప్రక్కిలంక వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మాంటిస్సోరీ, శ్రీవిజేత, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలను పట్టుకుని మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బొర్రా శ్రీరామచంద్ర మూర్తి, ముళ్ల మల్లి బాబు, అప్పన చంద్ర గుప్త, ఉపాధ్యాయులు పి రమణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు. వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు జయహో ఇస్రో అనే ఆకృతిలో విద్యార్థులు ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్‌బాలా మణి, ఉపాధ్యాయులు టి.రామచల్లయ్య, కె.లక్ష్మణ్ కుమార్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.


గోపాలపురం: వేళ్లచింతలగూడెంలో ర్యాలీ నిర్వహించారు. మండల బీజేపీ ఆధ్వర్యంలో ఇస్రో శాస్త్రవేత్తలు చేపట్టిన చందమామపై భారత్ మేనల్లుళ్ల అడుగుపెట్టిన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. సెయింట్ జోసఫ్ హైస్కూల్, ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు, నాయకులు కొండే పాటి రత్నాజీచౌదరి, వేములపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో ఆర్ ఎస్ఎస్, గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ



దూబచర్లలో సంఘమిత్రా విద్యార్థుల విన్యాసాలతో సంబరాలు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ట్రై సైకిళ్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ గురువారం ఆయన కార్యాలయంలో చందన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు అందించారు. దివ్యాంగుడు ఖండవల్లి శ్రీను, వృద్ధురాలు కర్రి నారాయణమ్మకు వీటిని పంపిణీ చేశారు. నాగేశ్వర్ మాట్లాడుతూ చందన చేయూత ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాణా హరిశ్చంద్ర, పేపకాయల హనుమంతు, కర్రి సత్తిబాబు, దారా సత్యనారాయణ, చిరంజీవి, కుంచాడ త్రిమూర్తులు, వుద్బా ప్రసన్నకుమార్‌రెడ్డి, తీగిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కంబాలచెరువు: స్థానిక కోరుకొండ రోడ్డులోని కెనరా బ్యాంక్ శాఖ సౌజన్యంతో శ్రీనాగరాజా నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలకు గురువారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కెనరా విద్యా జ్యోతి పథకం ద్వారా ఈ పురస్కారం అందజేస్తున్నట్టు బ్యాంక్ మేనేజర్ కె.సాయి మల్లి తెలిపారు. 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున, ఐదు నుంచి ఏడు తరగతుల విద్యార్థులకు రూ.2,500 చొప్పున మొత్తం ఆరుగురికి రూ.22,500 అందజేశామన్నారు. ప్రధానోపాధ్యాయుడు చక్రధర్, కెనరా బ్యాంక్ అధికారులు ఏ.శ్రీనివాస్, టి.తేజేశ్ పాల్గొన్నారు.

సోదరభావం పెంపొందించాలి

కంబాలచెరువు: పిల్లల్లో సోదరభావం పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. స్థానిక జిల్లా ప్రధాన న్యాయస్థానంలో గురువారం బాలలకు స్నేహపూర్వక న్యాయ సేవలు, వారి సంరక్షణ పథకంపై కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ పిల్లల్లో దేశభక్తి, సోదరభావం, మంచి, చెడు స్పర్శలకు ఉన్న వ్యత్యాసం తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం అన్ని విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీటిపై వెంటనే ప్రణాళికను రూపొందించి, కార్యాచరణ ఆరంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, విద్య, మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలన చట్టం తేవాలి

కంబాలచెరువు: మహారాష్ట్ర, కర్ణాటకలో మాదిరిగానే రాష్ట్రంలో కూడా మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎం.మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. స్థానిక ఆనంద నగర్ మున్సిపల్ హైస్కూల్లో నేషనల్ సైంటిఫిక్ డే ఉత్సవాల సందర్భంగా నరేంద్ర దభోల్కర్ సంస్మరణ సభను గురువారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాస్త్రీయ ధృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. శాస్త్రవేత్తల జీవితాలను అధ్యయనం చేస్తూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జి.తాతారావు, రవిబాబు, సీహెచ్‌వీ సూర్యం పాల్గొన్నారు.

మొక్కల సాగుకు శాస్త్రవేత్తల తోడ్పాటు

కడియం: మొక్కల సాగులో రైతులకు ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారానికి శాస్త్రవేత్తలు తమ వంతు తోడ్పాటు అందిస్తారని ఫ్లోరీ కల్చర్ రీసెర్చి సెంటర్ (పూణే) డైరెక్టర్ డాక్టర్ కేవీ ప్రసాద్ అన్నారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పలువురు శాస్త్రవేత్తల బృందంతో కలిసి కడియపులంక సర్ ఆర్డర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలకు వ్యాపించే తెగుళ్లను నివారించేందు వేమగిరి డీఎఫ్ఆర్‌సీ బృందం సహకారాన్ని రైతులు తీసుకోవాలన్నారు. సంబంధిత తెగులు సోకిన మొక్కను కేంద్రం వద్ద అందజేస్తే వాటిని పరీక్షించి, ఆ తెగులు నివారణకు అనుసరించాల్సిన పద్ధతులను రైతులకు వివరిస్తారన్నారు. అనంతరం రైతుల సందేహాలకు డాక్టర్ ప్రసాద్, శాస్త్రవేత్తలు డీవీఎస్ రాజు, రాంపాల్, శిరీష, మదన్ సమాధానాలిచ్చారు. మట్టికి ప్రత్యామ్నాయంగా వినియోగించదగిన మీడియాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలని, నర్సరీల్లో వచ్చే అగ్రివేస్ట్‌ను కంపోస్టుగా తయారు చేసుకునేందుకు సులభమైన విధానాన్ని అభివృద్ధి చేయాలని పలువురు రైతులు శాస్త్రవేత్తలను కోరారు. అలాగే ప్రతినెలా ఫెస్టిసైడ్ మేనేజ్‌మెంట్, ఇరిగేషన్, నెమటోడ్స్ తదితర విభాగాల వారీగా ప్రతినెలా ఒకరోజు వేమగిరి పరిశోధనా కేంద్రంలో అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అంతకు ముందు డాక్టర్ ప్రసాద్, శాస్త్రవేత్తల బృందానికి అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఉపాధ్యక్షులు పెనుమాక బుల్లికొండయ్య, అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు, నర్సరీ రైతులు పాల్గొన్నారు.



నర్సరీ రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్, చిత్రంలో శాస్త్రవేత్తలు, రైతులు

కిడ్నీ బాధితుడికి ఎంపీ భరత్ రామ్ భరోసా

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక సీటీఆర్ఐ సుబ్బారావు నగర్ కమ్యూనిటీ హాలు సమీపంలో నివసిస్తున్న కార్పెంటర్, వైఎస్సార్ సీపీ కార్యకర్త 35 ఏళ్ల ఏలూరి రామస్వామి రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు ఎంపీ మార్గాని భరత్ రామ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీ వెంటనే రామస్వామి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు తెలుసుకుని, కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. కిడ్నీ ఇచ్చేందుకు రామస్వామి తల్లి మణి ముందుకు రావడంతో విశాఖ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయనున్నారు. అయితే ఈ ఆపరేషన్‌కు కావాల్సిన అనుమతులపై ఆర్డీవో, తహసీల్దార్, ఆరోగ్యశ్రీ అధికారులతో ఎంపీ భరత్ స్వయంగా మాట్లాడారు. రామస్వామి ఆరోగ్యంపై కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.



రామస్వామికి భరోసా కల్పిస్తున్న ఎంపీ భరత్ రామ్

గుబ్బల రాంబాబు సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ద్వారా డాక్టర్ గుబ్బల రాంబాబు చేస్తున్న అభినందనీయమని లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ మాటూరు మంగతాయారు అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో గురువారం మధ్యాహ్నం జరిగిన లయన్స్ క్లబ్ ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022 –23లో తన పదవీ కాలంలో అత్యున్నత అన్నదాన సేవలు అందించినందుకు రాంబాబుకు ప్రతిష్టాత్మక లయన్స్ అన్నదాత అవార్డు అందిస్తున్నామన్నారు. ఆయన ఇటు స్వర్ణాంధ్ర సేవా సంస్థతో పాటు లయన్స్ క్లబ్ సేవల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారన్నారు.